


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| బుధవారం 13 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 345 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై ముఖ్యమంత్రి సమీక్ష

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 13, ప్రతినిధి: రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణ ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో బుధవారం దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణను వేగవంతం చేసి రైతులకు చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, లోక్‌సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అలాగే మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, వివిధ జిల్లాల కలెక్టర్లు సమావేశంలో పాల్గొన్నారు.




## జూన్ 2న ఆదిలాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 13, ప్రతినిధి: రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో రెండో విడతను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. మొదటి విడత నిర్మాణాలు పూర్తికావస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. మంగళవారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. సమావేశంలో శాసనసభ స్పీకర్ జి. ప్రసాద్ కుమార్, మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలి ప్రధాన విప్ పి. మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గత ప్రభుత్వం నగరానికి దూరంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించడం వల్ల లబ్ధిదారులకు జీవనోపాధిపై ఇబ్బందులు తలెత్తాయని పేర్కొన్న మంత్రి, ఇకపై పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, మురికివాడలు, భూదాన్ భూములు, శిథిలావస్థలో ఉన్న పాత గృహ నిర్మాణ ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు ఈ నెలాఖరులోగా లబ్ధిదారులను గుర్తించి కేటాయించాలని, ఆయా కాలనీలకు సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. మంచినీరు, మురుగు పారుదల, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలో ఇళ్ల స్థలాలు కలిగి అర్హత సాధించిన వారికి ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేయాలని తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించిన మంత్రి, మల్కాజిగిరి ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూ నమోదులపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పేదరికమే అర్హతగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని, ఇందులో రాజకీయాలకు తావు లేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి పేదలకు ప్రయోజనం చేకూరేలా చూడాలని ప్రజాప్రతినిధులు సూచించారు.

## విద్యుత్ వాహనాల ఛార్జింగ్ వ్యవస్థలో తెలంగాణ ఆదర్శం






సందేశం టైమ్స్, బెంగళూరు, మే 13, ప్రతినిధి: దేశవ్యాప్తంగా విద్యుత్ వాహనాల ఛార్జింగ్ మౌలిక వసతుల అభివృద్ధిపై నిర్వహించిన జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్రం తన విజయగాథలు, అమలు విధానాలను ప్రదర్శించింది. మే 12న బెంగళూరులోని తాజ్ యశ్వంత్‌పూర్ హోటల్‌లో జరిగిన ఈ సదస్సులో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ, పలు రాష్ట్రాల విద్యుత్, రవాణా శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యుత్ వాహన తయారీ సంస్థలు, ఛార్జింగ్ మౌలిక వసతుల సంస్థలు పాల్గొన్నాయి. ప్రారంభ సమావేశంలో కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామి, పలు రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ప్రజలకు అందుబాటులో ఉండే విద్యుత్ వాహన ఛార్జింగ్ కేంద్రాల విస్తరణ, రాష్ట్రాల విజయవంతమైన నమూనాలు, వినూత్న విధానాలపై ఈ సదస్సులో చర్చించారు. ఈ సందర్భంగా విద్యుత్ వాహన యజమానులకు సులభ సేవల కోసం జాతీయ సమగ్ర విద్యుత్ వాహన ఛార్జింగ్ దరఖాస్తు వేదికను ప్రారంభించారు. తెలంగాణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగం, ఛార్జింగ్ మౌలిక వసతుల అభివృద్ధిపై వివరాలు వెల్లడించారు. తెలంగాణలో ప్రస్తుతం 2.8 లక్షలకు పైగా విద్యుత్ వాహనాలు నమోదై ఉండగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 91,572 కొత్త వాహనాలు నమోదయ్యాయి. కొత్త వాహనాల నమోదులో సుమారు ఐదు శాతం విద్యుత్ వాహనాలేనని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వాహనాల మార్కెట్ విలువ రూ.6,297 కోట్లకు చేరిందన్నారు. ప్రజా రవాణాలో భాగంగా 325 విద్యుత్ బస్సులు నడుస్తుండగా, 240 డీజిల్ బస్సులను విద్యుత్ బస్సులుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో 2027 నాటికి 2,800 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టే లక్ష్యంతో దేశంలోనే అతిపెద్ద కార్యక్రమాల్లో ఒకటి అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,063 విద్యుత్ వాహన ఛార్జింగ్ కేంద్రాలు పనిచేస్తుండగా, వాటిలో సుమారు 600 హైదరాబాద్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సుమారు 200 ప్రజా ఛార్జింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యుత్ వాహనాల ఛార్జింగ్ వినియోగం సంవత్సరానికి నాలుగు రెట్లు పెరిగిందని వెల్లడించారు. ప్రధానమంత్రి విద్యుత్ ప్రోత్సాహక పథకం కింద 116 ప్రాంతాల్లో కొత్త ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూ.10.24 కోట్ల మంజూరు లభించిందన్నారు. 2030 నాటికి 6 వేల ఛార్జింగ్, బ్యాటరీ మార్పిడి కేంద్రాలు, 2035 నాటికి 12 వేల కేంద్రాల ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. విద్యుత్ వాహనాలకు రోడ్డు పన్ను, నమోదు రుసుములపై వంద శాతం మినహాయింపు కల్పించడం వల్ల వినియోగం వేగంగా పెరుగుతోందని పేర్కొన్నారు.

## చంచల్‌గూడలో తెలంగాణ జైలు మ్యూజియం ప్రారంభం






సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 13, ప్రతినిధి: చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో తెలంగాణ జైలు మ్యూజియం మరియు "జైలు అనుభవం" కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ జైలు మ్యూజియం స్థాపన రాష్ట్ర కారాగార చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఒకప్పుడు జైళ్లు కేవలం శిక్షా కేంద్రాలుగా ఉండేవని, ఖైదీలు తీవ్రమైన శారీరక, మానసిక ఇబ్బందులు అనుభవించేవారని గుర్తుచేశారు. కాలక్రమేణా జైలు వ్యవస్థలు సంస్కరణ, పునరావాసం, మానవీయతకు ప్రతీకలుగా మారాయని తెలిపారు. ఆ పరిణామ క్రమాన్ని ఈ మ్యూజియం ప్రతిబింబిస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి అమలు చేసిన తెలంగాణ కారాగార శాఖను, ముఖ్యంగా కారాగారాలు మరియు సంస్కరణ సేవల ప్రధాన సంచాలకురాలు డాక్టర్ సౌమ్య మిశ్రా మరియు ఆమె బృందాన్ని గవర్నర్ అభినందించారు. మ్యూజియంలో పెయింటింగ్ ప్రదర్శనలు, పాత జైలు బ్యారక్కుల నమూనాలు, గొలుసులు, సంకెళ్లు, ఉరికంబాలు, అరుదైన చారిత్రక వస్తువులు, దృశ్య శ్రవణ ప్రదర్శనల ద్వారా పూర్వకాల జైలు జీవితం నుంచి ఆధునిక సంస్కరణాత్మక కారాగార వ్యవస్థల వరకు జరిగిన మార్పులను ప్రజలు తెలుసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. "జైలు అనుభవం" కార్యక్రమం ద్వారా ప్రజలకు జైలు జీవనం, క్రమశిక్షణ, ఖైదీల పరిస్థితులపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. ఇది చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యత, మానవీయ విలువలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఖైదీల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, జైలు పరిశ్రమలు, వ్యవసాయం, పునరావాస కార్యక్రమాల్లో తెలంగాణ కారాగార శాఖ చేపడుతున్న సంస్కరణలను గవర్నర్ ప్రశంసించారు. కార్యక్రమంలో మాట్లాడిన డాక్టర్ సౌమ్య మిశ్రా ఈ మ్యూజియాన్ని అవగాహన, విద్య, పరిశోధన, చారిత్రక అధ్యయనం కోసం సమగ్ర కేంద్రంగా అభివృద్ధి చేశామని తెలిపారు. నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణ సమయంలో ఖైదీలు చేసిన సేవలను ప్రత్యేక విభాగంలో ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. "జైలు అనుభవం" కార్యక్రమం కింద ప్రజలకు 12 గంటలు, 24 గంటల చెల్లింపు ఆధారిత జైలు జీవన అనుభూతి కల్పిస్తున్నామని, ఇందులో జైలు వసతి, భోజనం, క్రమశిక్షణ, నియంత్రిత జీవన విధానం ఉంటాయని వివరించారు. ఇది వినోదం కోసం కాకుండా అవగాహన, సహానుభూతి, బాధ్యతా భావం పెంపొందించడానికేనని స్పష్టం చేశారు. ప్రజల సందర్శనల కోసం అధికారిక అంతర్జాల వేదికను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కారాగార శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది, ఆహ్వానితులు, మాధ్యమ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 1919 మంది నర్సింగ్ అధికారులకు నియామక పత్రాలు అందజేసిన ప్రభుత్వం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 13, ప్రతినిధి: ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ అధికారులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. కోటిలోని ఉస్మానియా వైద్య కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, లోక్‌సభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, శాసన మండలి సభ్యులు అద్దంకి దయాకర్, మీర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ సంగీత సత్యనారాయణ, వైద్య విద్య సంచాలకుడు నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, ప్రజారోగ్య సంచాలకుడు రవీంద్ర నాయక్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నర్సులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. నర్సింగ్ అనేది కేవలం వృత్తి మాత్రమే కాదని, మానవత్వానికి సేవ చేసే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. రోగులకు చికిత్సతో పాటు ధైర్యం, భరోసా, ఆశను అందించేది నర్సులేనని కొనియాడారు. ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను స్మరించుకోవాలని సూచించారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన నర్సుల సేవలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. గతంలో ప్రభుత్వ దవాఖానాల్లో ఖాళీలు ఎక్కువగా ఉండటంతో వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి ఉండేదని, ఈ సమస్యను ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుని భారీ స్థాయిలో నియామకాలు చేపట్టిందన్నారు. గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే 1257 మంది ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, 623 మంది సివిల్ సహాయ శస్త్రచికిత్స నిపుణులు, 132 మంది సహాయ ఆచార్యులకు ఇదే ప్రాంగణంలో నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. గతంలో 6956 నర్సింగ్ అధికారుల పోస్టులు భర్తీ చేశామని, రెండున్నరేళ్లలో 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత ప్రభుత్వానిదేనన్నారు. మరో 5 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, అందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలను ఒకటి రెండు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఔషధ నిపుణుల పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ దవాఖాన పూర్తిస్థాయిలో సిబ్బందితో పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నర్సింగ్ విద్యను విస్తరిస్తున్నామని, గత రెండేళ్లలో 16 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేసి 960 బీఎస్సీ నర్సింగ్ సీట్లను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం విద్యార్థులకు జర్మన్, జపాన్, ఆంగ్ల భాషలలో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సుమారు లక్షా 80 వేల మంది నమోదిత నర్సులు సేవలందిస్తున్నారని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక నర్సింగ్ సంచాలక వర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి సంవత్సరం నర్సులకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న మూడు మిడ్‌వైఫరీ శిక్షణ కళాశాలలను దశలవారీగా అన్ని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలకు విస్తరిస్తామని తెలిపారు. మాతా శిశు ఆరోగ్య సేవలు మెరుగుపడి ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నర్సులు కీలక పాత్ర పోషించాలని మంత్రి పిలుపునిచ్చారు.

## మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరణ పూర్తి చేయాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 13, ప్రతినిధి: రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి శిబిర కార్యాలయంలో నిర్వహించిన దృశ్య మాధ్యమ సమావేశంలో వివిధ జిల్లాల కలెక్టర్లతో ధాన్యం సేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలని సూచించారు. గన్ని సంచులు, హమాలీల కొరత లేకుండా చూడాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు సరిపడా లారీలు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. గోదాముల కొరత ఉన్న ప్రాంతాల్లో రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని కలెక్టర్లకు సూచించారు. మొక్కజొన్న పంట అధికంగా వచ్చే జిల్లాల్లో కొనుగోళ్ల విషయంలో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని, అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని తెలిపారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, వాతావరణ హెచ్చరికలను రైతులకు చేరవేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రం, ప్రతి రైస్‌మిల్లుకు బాధ్యతాయుత అధికారులను నియమించి పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదులు అందించాలని, అక్రమాలకు అవకాశం లేకుండా చూడాలని సూచించారు. కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణతో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం సేకరణలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ పూర్తిచేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించిన నాయకులు



సందేశం టైమ్స్, మెదక్ జిల్లా అల్లాదుర్గం, మే 13, రూరల్ ప్రతినిధి కుమార్: మండలంలోని పాపన్నపేట గ్రామానికి చెందిన చాకలి సాయిలు అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించిన గ్రామ కాంగ్రెస్ నాయకులు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించారు. గ్రామ కాంగ్రెస్ నాయకుడు నిటలాక్షప్ప రూ.5 వేల రూపాయలు, ఆరో వార్డు సభ్యుడు శ్రీరామ్ దుర్గయ్య రూ.2 వేల రూపాయలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, కృష్ణ, దుర్గయ్య, వెంకటేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.




## ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్


సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 13, ప్రతినిధి: బక్రీద్ పండుగను ఆనందోత్సాహాలతో పాటు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజలను కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ప్రేమ, పరస్పర గౌరవం పెంపొందించే ఈ పవిత్ర పండుగను అందరూ ఐకమత్యంతో నిర్వహించాలని సూచించారు. బక్రీద్ పండుగ త్యాగానికి, సేవాభావానికి ప్రతీక అని పేర్కొంటూ పేదలకు సహాయం చేయడం, అవసరమైన వారికి తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా మసీదులు, ప్రార్థనా స్థలాలు, ప్రజలు అధికంగా గుమికూడే ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి పండుగను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీవో రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా రవాణా అధికారి వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్లు, పశుసంవర్ధక శాఖ అధికారులు, డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.




## ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహించాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 13, ప్రతినిధి: జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును మరింత విస్తరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్ ఫామ్ సాగు ప్రగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తక్కువ వ్యయంతో అధిక లాభాలు అందించే పంటగా ఆయిల్ ఫామ్ రైతులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన మొక్కలు, ఎరువులు, సాంకేతిక సూచనలు అందించేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు సాగులోకి వచ్చిన ఆయిల్ ఫామ్ విస్తీర్ణం, కొత్తగా నమోదు చేసుకున్న రైతుల వివరాలు, నీటి వనరుల లభ్యత, డ్రిప్ సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆయిల్ ఫామ్ పంటపై రైతుల్లో మరింత అవగాహన పెంచేందుకు ప్రత్యేక శిబిరాలు, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. సాగు ప్రారంభించిన రైతులకు సకాలంలో సబ్సిడీలు, సాంకేతిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటల వైపు రైతులు దృష్టి సారిస్తే ఆర్థికంగా మరింత లాభపడతారని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా దీర్ఘకాలిక ఆదాయం లభిస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


## జొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి: సీపీఎం డిమాండ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 13, ప్రతినిధి: పెద్ద శంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్ ప్రాంతాల్లో జొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం మాట్లాడుతూ మెదక్ జిల్లాలో పెద్ద శంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్ ప్రాంతాల్లో జొన్న పంట అధికంగా సాగు చేశారని తెలిపారు. ఇప్పటికే నూర్పిడి పూర్తయినప్పటికీ జొన్న కొనుగోలుకు సరైన మార్కెట్ సౌకర్యం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్య దళారులు తక్కువ ధరలకు పంటను కొనుగోలు చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. జొన్న పంట తక్కువ నీటి వినియోగం, తక్కువ రసాయన ఎరువులు, తక్కువ పెట్టుబడితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటగా ఉందని తెలిపారు. ఇలాంటి పంటలను పండించే రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గత సంవత్సరం రేగోడ్ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం నిర్వహించారని, ఈ ఏడాది కూడా అదే విధంగా కేంద్రం నిర్వహించేందుకు అనుమతులు కోరుతూ జిల్లా అధికారులకు లేఖ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు అనుమతులు ఇవ్వలేదని విమర్శించారు. ఈ ఏడాది కూడా జొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి రైతులను ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మెదక్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు: సీఎం రేవంత్ రెడ్డి






సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 13, ప్రతినిధి: ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మెదక్ సమీకృత జిల్లా కార్యాలయం నుంచి పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే అన్ని ప్రైవేట్ గోదాములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు. స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించి ఎక్కడా కొరత రాకుండా చూడాలని, అధిక డబ్బు డిమాండ్ చేస్తే వారి అనుమతులను రద్దు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్‌మిల్లుల వద్ద కోతలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రవాణా కోసం ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను వినియోగించాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి రైస్‌మిల్లుకు ప్రత్యేక అధికారిని నియమించి పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై వచ్చే ప్రతికూల వార్తలకు వెంటనే స్పందించి వివరణలు విడుదల చేయాలని సూచించారు. రవాణా కోసం నిబంధనల ప్రకారం వాహనాలు అందించని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, కొనుగోళ్ల కోసం రాష్ట్ర మంత్రివర్గం రూ.4,178 కోట్లు ఆమోదించిందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవో రమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, పౌర సరఫరాల అధికారి నిత్యానంద, రవాణా అధికారి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.




## జనగణన తొలి దశ గృహాల లెక్కింపు ప్రక్రియ పరిశీలన

సందేశం టైమ్స్, ఖమ్మం, మే 13, ప్రతినిధి: జనగణన–2027 తొలి దశ గృహాల లెక్కింపు ప్రక్రియను జెడిసిఓ రఘు, హైదరాబాద్ సెన్సస్ అధికారి హిమవర్ష, ఖమ్మం సిపిఓ పరిశీలించారు. చింతకాని మండలంలోని వందనం, లచ్చగూడెం, చింతకాని గ్రామాలను సందర్శించి ఎన్యూమరేటర్లు, పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. గృహాల లెక్కింపు ప్రక్రియను కచ్చితత్వంతో, సమగ్రంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి ఇంటి వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, డీవైఎస్‌వో, ఏఎస్‌వో, రెవెన్యూ, పంచాయతీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణ వేగవంతంగా చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 13, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, పౌర సరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, పోలీసు, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడీవోలు, మండల ప్రత్యేక అధికారులు తదితరులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ధాన్యం సేకరణ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైస్‌మిల్లుల్లో హమాలీల సంఖ్య, లారీల అందుబాటు తదితర అంశాలపై తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ వేగంగా జరగాలని, అన్‌లోడింగ్ ప్రక్రియలో హమాలీల సంఖ్య పెంచుకోవాలని సూచించారు. లారీల సంఖ్యను పెంచాలని, అవసరమైతే డీసీఎంలు, ట్రాక్టర్లను కూడా రవాణాకు వినియోగించాలని ఆదేశించారు. అధికారులు అందరూ క్షేత్రస్థాయిలో ఉండి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యాన్ని రక్షించేందుకు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. మిల్లర్లు అన్‌లోడింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి లారీలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవో రమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, పౌర సరఫరాల అధికారి నిత్యానంద, రవాణా అధికారి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సుబాబుల్ తోట దగ్ధం – రూ.3 లక్షల ఆస్తి నష్టం



సందేశం టైమ్స్, ఖమ్మం జిల్లా చింతకాని, మే 13, ప్రతినిధి: మండలంలోని రామకృష్ణాపురం గ్రామం బస్వాపురం రెవెన్యూ పరిధిలో జరిగిన అగ్నిప్రమాదంలో సుబాబుల్ తోట పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన న్యాయవాది కన్నెబోయిన నాగేశ్వరావుకు చెందిన సర్వే నంబర్ 160లో ఉన్న సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలోని రెండేళ్ల వయస్సు గల సుబాబుల్ తోట మంటల్లో కాలిపోయింది. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు. చుట్టుపక్కల రైతులు చెత్తకు నిప్పంటించడంతో మంటలు వేగంగా వ్యాపించి తోటను చుట్టుముట్టినట్లు సమాచారం. దూర ప్రాంతం నుంచి వచ్చిన మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో చెట్లు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో తోట చుట్టూ ఏర్పాటు చేసిన కంచె రాళ్లు కూడా వేడికి దెబ్బతిన్నాయి. కొన్ని రాళ్లు ఇప్పటికే కూలిపోగా, మరికొన్ని స్వల్పంగా తాకినా పడిపోయే పరిస్థితిలో ఉన్నాయని రైతు నాగేశ్వరావు ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా శ్రమించి పెంచుకున్న తోట ఒక్కసారిగా దగ్ధమవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. ఘటనపై అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తరఫున తగిన పరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నారు.

# ముత్తంగిలో రూ.84 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 13, బి. డేవిడ్: పటాన్‌చెరు ముత్తంగి డివిజన్ పరిధిలోని డీఎన్ కాలనీ, సాయి ప్రియా కాలనీ, పార్థ కాలనీలలో రూ.84 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కాలనీలలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 13, బి. డేవిడ్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ పంచముఖి హనుమాన్ దేవాలయం, చైతన్యనగర్ హనుమాన్ దేవాలయాలను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# ఘనంగా 20వ వివాహ వార్షికోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 13, జిల్లా సమన్వయకర్త బి. సంగమేశ్వర్: సంగారెడ్డి పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీలో దేవదాస్ – సునంద దంపతుల 19వ వివాహ వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకుని 20వ వివాహ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా వారి కుమారులు లక్కీ, చింటూ ఘనంగా వేడుకలు నిర్వహించారు. సునంద నర్సుగా సేవలందిస్తుండగా, ఆమె సేవా దినోత్సవం మరియు వివాహ వార్షికోత్సవం ఒకే రోజు రావడం ఎంతో ఆనందంగా ఉందని కుమారులు సంతోషం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం నిర్వహించారు.

# శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయంలో భారీ అగ్ని ప్రమాదం



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 13, టౌన్ ప్రతినిధి వి. సాయి: పటాన్‌చెరు పట్టణంలోని శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయంలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. కార్యాలయం నుంచి ఒక్కసారిగా మంటలు, పొగలు వ్యాపించడంతో లోపల ఉన్న సిబ్బంది, వినియోగదారులు భయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే ఘటన స్థలానికి చేరుకోగా, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు.




# పటాన్‌చెరువు ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి: మాదిరి పృథ్వీరాజ్

సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 13, బి. డేవిడ్: హనుమాన్ జయంతి సందర్భంగా పటాన్‌చెరు, జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని హనుమాన్ దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ నాయకుడు, ఎండిఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాదిరి పృథ్వీరాజ్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయ స్వామి కరుణాకటాక్షాలతో పటాన్‌చెరువు ప్రజలు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంట ఆనందం, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.



# సందేశం టైమ్స్ జర్నలిస్ట్ లకు సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుంది : సీఈఓ వెంకటేష్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 13, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఇంచార్జి, సందేశం టైమ్స్ ప్రతినిధి సంగమేశ్వర్ ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న సంస్థ యాజమాన్యం ఆయనను పరామర్శించింది. ఈ సందర్భంగా సందేశం టైమ్స్ సీఈఓ శ్రీ వెంకటేష్ సార్ స్వయంగా ఆసుపత్రికి వెళ్లి సంగమేశ్వర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అలాగే రాష్ట్ర సమన్వయకర్త టి. సంగమేశ్వర్, సంగారెడ్డి కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్, అందోల్ మండల రిపోర్టర్ వి. వెంకటేశం, మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్ తదితరులు పరామర్శ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంగమేశ్వర్ త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఈఓ వెంకటేష్ సార్ మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితుల్లోనైనా సందేశం టైమ్స్ కుటుంబ సభ్యులకు సంస్థ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండి త్వరగా కోలుకోవాలని అన్నారు. ఈ పరామర్శ కార్యక్రమం సంస్థలోని అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పింది.

# ఇంద్రేశం సమస్యల పరిష్కారంపై కమిషనర్‌కు వినతి



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 13, టౌన్ ప్రతినిధి వి. సాయి: పటాన్‌చెరు మండలంలో నూతనంగా ఏర్పడిన ఇంద్రేశం మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ నాయకుడు నల్ల నాగుల మురళి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 13వ వార్డు పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వార్డు సమగ్ర అభివృద్ధికి తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# రూ.3.25 లక్షల విలువైన ఎల్‌వోసీలు అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 13, బి. డేవిడ్: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి గ్రామానికి చెందిన ఉపేంద్ర కుమార్, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం గ్రామానికి చెందిన సుజాతలు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం వారు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, వారికి మంజూరైన రూ.3 లక్షల 25 వేల విలువైన ఎల్‌వోసీ మంజూరు పత్రాలను మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, యునూస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం



సందేశం టైమ్స్, అందోల్ నియోజకవర్గం, మే 13: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జోగిపేట బస్టాండ్‌లో తెలంగాణ ముదిరాజ్ సామాజిక చైతన్య సొసైటీ ఆధ్వర్యంలో చల్లటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. తెలంగాణ ముదిరాజ్ రాష్ట్ర నాయకులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ, ఎండకాలంలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఇబ్బంది పడకుండా తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), బాయికాడి భూమయ్య, డాకూరి రఘునాథ్, మానయ్య, అబ్బాస్ అలీ, నజీర్, చోటు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐ.టి.ఐ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 13: కమీషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్, హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారం 2026–2027 విద్యా సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఐ.టి.ఐ, ఏ.టి.సి మరియు ప్రైవేట్ ఐ.టి.ఐలలో వివిధ ట్రేడ్లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ డి. తిరుపతి రెడ్డి తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ మే 14 నుంచి జూన్ 8 వరకు ఆన్‌లైన్ ద్వారా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు http://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు



సందేశం టైమ్స్, అందోల్, మే 13, నియోజకవర్గ ఇంచార్జ్: సంగారెడ్డి జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను టెలిఫోన్ ద్వారా ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్‌తో మంత్రి సెల్‌ఫోన్‌లో చర్చించారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ, ఐకేపీ, సహకార సంఘాలు, రవాణా శాఖలతో సమన్వయం చేసుకొని కొనుగోళ్లు శరవేగంగా జరగాలని సూచించారు. రైతులు కేంద్రాల వద్ద ఎదురుచూడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు పడితే రైతులు భారీగా నష్టపోతారని హెచ్చరిస్తూ, కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.



## జనగణన ప్రతి పౌరుడి బాధ్యత జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 13: జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర మరియు ఖచ్చితమైన సమాచారం దేశ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుండి ఐబీ వరకు నిర్వహించిన "జనగణన అవగాహన మారథాన్ వాక్" కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మే 10 వరకు స్వీయ గణన పూర్తవగా మే 11 నుంచి ఇంటింటి గణన ప్రారంభమైనట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని, వారికి ప్రజలు సహకరించాలని కోరారు. సేకరించిన వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టత ఏర్పడి సంక్షేమ పథకాల రూపకల్పన, అమలుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఎన్యూమరేటర్లు, విద్యార్థులు, సాంస్కృతిక సారథి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.




## పాఠశాలల పునర్వైభవానికి నడుం బిగించాలి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 13, 2026, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాలల దత్తత కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, దాతలు భారీగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు ఈ వినూత్న కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. సూర్యాపేట మండలం పిల్లలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనోబుల్ ఫౌండేషన్ సంస్థ సహకారంతో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆర్థిక సహాయంతో చేపట్టిన మరమ్మతులు, సుందరీకరణ పనులు, సైన్స్-టెక్నాలజీ-ఇంజనీరింగ్-మ్యాథ్స్-ఆర్ట్స్ ల్యాబ్ ఏర్పాటు, అలాగే క్రీడా సామాగ్రి పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, తాగునీరు, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి దాతల సహకారం అత్యంత అవసరమని వివరించారు. అభివృద్ధి పనులకు వెచ్చించే ప్రతి రూపాయికి పూర్తి పారదర్శకత ఉంటుందని, దాతలు స్వయంగా పనులను పర్యవేక్షించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్న ఆయన, తాము ఎదిగిన పాఠశాలలకు తిరిగి సేవ చేయాలనే భావన ప్రతి పూర్వ విద్యార్థిలో ఉండాలని, మన ఊరి బడిని మనమే అభివృద్ధి చేసుకుందామని కోరారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, హెడ్ మాస్టర్ జనార్ధన్, తహసీల్దార్ కృష్ణయ్య, జీఐసీ ప్రతినిధులు శ్వేత, శుభధ, ఎనోబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు శారద, జయరాజ్ మెహతా, శ్రావణ్ జైస్వాల్, వార్డు కౌన్సిలర్ నాగరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సోమమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు యుద్ధ ప్రాతిపదిక చర్యలు




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 13: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పెంపుదలకు సంబంధించి చేపట్టిన పనుల ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా మంజూరైన పనులు, పూర్తైన పనుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, వెంటిలేషన్, తరగతి గదుల్లో ఫ్యాన్లు వంటి కనీస వసతులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అవసరమైన చోట టాయిలెట్స్, తాగునీటి సదుపాయం, విద్యుత్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పనులు పూర్తైన పాఠశాలలకు పెయింటింగ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు తీసుకుని పనులు చేపట్టాలని తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టగల పనులను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఎంపీడీవోలు పాఠశాలలను సందర్శించి మౌలిక వసతుల పరిస్థితిని తప్పనిసరిగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశం



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 13, 2026, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల ముప్పును దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేయగా ఇప్పటివరకు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విజయవంతంగా సేకరించామని తెలిపారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియ మందగించడంపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్, హమాలీల కొరత కారణంగా జాప్యం జరుగుతోందని పేర్కొని హమాలీల సంఖ్యను పెంచి మూడు షిఫ్టుల్లో పని చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు గోదాములు అద్దెకు తీసుకోవాలని సూచించారు. అలాగే రవాణా సమస్యలను పరిష్కరించేందుకు అదనపు లారీలు, డీసీఎంలను సమన్వయంతో వినియోగించాలని, సమీప కేంద్రాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులు, హమాలీలు అందుబాటులో ఉండేలా తహసీల్దార్లు బాధ్యత వహించాలని, ప్రతి మిల్లుకు ప్రత్యేక ఇన్‌చార్జ్ అధికారిని నియమించాలని ఆయన ఆదేశించారు.అదే సమయంలో జిల్లాలోని నాగారం, జాజిరెడ్డి గూడెం, తిరుమలగిరి మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలని, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు వెంటనే పరిష్కరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ కే నరసింహ, అదనపు కలెక్టర్ బి హరి సింగ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, పీడీ డీఆర్డీఏ సన్యాసయ్య, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రైస్ మిల్లర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 12: రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లు, వరి ధాన్యం సేకరణ ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోలు కేంద్రాల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని, గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని, నిల్వ సదుపాయాల కోసం రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను వినియోగించాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం, ప్రతి రైస్ మిల్లుకు బాధ్యతాయుతమైన అధికారిని నియమించి మిషన్ మోడ్‌లో పని చేయాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.అదేరోజు కలెక్టరేట్‌లో నిర్వహించిన మరో సమీక్షలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బార్డర్ ప్రాంతాల ద్వారా ఇతర రాష్ట్రాల ధాన్యం జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనాలు, హమాలీలు, గోదాముల సమస్యలు లేకుండా సమన్వయంతో పని చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## పాలీసెట్–2026 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 13: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించనున్న పాలీసెట్–2026 పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకి దేవి తెలిపారు. ఈ పరీక్ష బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణం, జోగిపేట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మొత్తం ఆరు పరీక్ష కేంద్రాల్లో 2,068 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు.విద్యార్థులు ఉదయం 9.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 10 గంటల నుంచి మాత్రమే కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని తెలిపారు. ఉదయం 11 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని, హెచ్‌బీ పెన్సిల్, బాల్ పాయింట్ పెన్, ఎరేజర్, షార్పనర్ తీసుకురావాలని సూచించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.